క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న యువకుడు



కాటారం: రోడ్డుపై దొరికిన ఐ ఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. కేసముద్రంకు చెందిన ప్రణీత్ కాటారం హెచ్‌పీ పెట్రోల్‌బంకులో పెట్రోల్ పోయించుకొని వరంగల్‌కు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో తన ఐ ఫోన్ పడిపోగా కాటారంకు చెందిన విజయ్‌కుమార్‌కు దొరికింది. దీంతో విజయ్‌కుమార్ కాటారం పోలీసులకు అప్పగించాడు. తన ఐ ఫోన్ పోయిందని సదురు బాధితుడు కాటారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కానిస్టేబుళ్లు హరికుమార్, లవన్‌లు ఫోన్‌ను బాధితుడికి అందించారు. దొరికిన ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన విజయ్‌కుమార్‌ను పోలీసుల అభినందించారు.

ఎమ్మెల్యేకు రైతుల వినతి



మల్హర్: మండలంలోని రుద్రారంలో గల ఊర చెరువు మరమ్మతులు చేపట్టాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రైతులు కోరారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే మరమ్మత్తులు చేపట్టేలా కృషి చేయాలని కోరారు. కొయ్యూరులో పర్యటించిన ఎమ్మెల్యేను కలిసిన రైతులు తమ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. గత వర్షాకాలం సీజన్‌లో అధిక వర్షాల కారణంగా చెరువు కట్ట తెగిపోయిందన్నారు. దీంతో పొలాలు సాగుకు నోచుకోవడం లేదని, అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చెరువు మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

తప్పని గ్యాస్ తిప్పలు

టేకుమట్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో భారత్ గ్యాస్ కనెక్షన్ తీసుకున్న లబ్ధిదారులకు ఆ సంస్థ ఏజెన్సీ ముప్పుతిప్పలు పెడుతున్నారు. నెల రోజులుగా గ్యాస్ సిలిండర్లను అందించకపోవడంతో మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరలకు గ్యాస్ సిలీండర్‌ను కొనుగోలు నష్టపోతున్నారు. భారత్ గ్యాస్ మొగుళ్లపల్లి ఏజెన్సీ నుంచి మండలంలోని పలు గ్రామాలకు గత కొన్ని సంవత్సరాలుగా గ్యాస్‌లను అందిస్తున్నారు. నెల రోజులుగా గ్యాస్ ఏజెన్సీ వారిని ఫోన్‌లో సంప్రదిస్తే స్పందించడం లేదని, ఇప్పటికైనా గ్యాస్ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా గ్యాస్ ఏజెన్సీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మహాముత్తారం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుభద్ర అధ్యక్షతన రేపు(శుక్రవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి గౌరవ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామలింగేశ్వరుడికి కేటీఆర్ పూజలు

వెంకటాపురం(ఎం): రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రివర్యుడు కల్వకుంట్ల తారక రామారావు ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని గురువారం సందర్శించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్వర్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజారులు హరీష్ శర్మ, ఉమాశంకర్‌లు కేటీఆర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కేటీఆర్‌ను, మంత్రులను ఆలయ అధికారులు శాలువాలతో సత్కరించారు. రామప్ప ఆలయ చరిత్రను టూరిజం గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. అనంతరం పలువురు కేటీఆర్‌కు సమస్యలు పరిష్కారించాలని వినతిపత్రాలు సమర్పించారు. కేటీఆర్‌తో ఫొటోలు దిగేందుకు బీఆర్ఎస్ నాయకులు, అధికారులు ఉత్సాహం చూపగా ప్రతి ఒకరితో కేటీఆర్ సమయాన్ని కేటాయించి ఫొటోలు దిగారు.

గోదావరి జలాలకు పూజలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా కేటీఆర్ రామప్ప సరస్సును సందర్శించి గోదావరి జలాలకు పూజలు నిర్వహించారు. రామప్ప సరస్సును రిజర్వాయర్‌గా మార్చి గోదావరి జలాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాగునీటి దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నట్లు వివరించారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతుల కోసం కృషి చేస్తుందని వివరించారు.

అధికార పార్టీ నేతలను అడ్డుకున్న పోలీసులు

రామప్ప సరస్సు దగ్గర గోదావరి జలాలకు కేటీఆర్ పూజలు చేసే క్రమంలో అక్కడకు వెళ్తున్న ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ గై రుద్రమదేవి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, సీనియర్ నాయకుడు మల్క రమేష్‌ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న మంత్రి దయాకర్ రావు ప్రభుత్వం ప్రోగ్రాం సక్సెస్ కావాలని చూడాలే తప్ప గొడవలేంటి అని స్థానిక ప్రజాప్రతినిధులను మందలించారు. దీనితో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు నిరాశ చెందారు.

పోలీసుల ఓవర్ యాక్షన్

రామప్ప సరస్సులో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న కేటీఆర్ ప్రోగ్రాంను కవరేజీ చేసేందుకు వెళ్తున్న డీపీఆర్ఓ రఫిక్‌ను పోలీసులు అడ్డుకొని ఇబ్బందులకు గురిచేశారు. జిల్లా పీఆర్ఓను అని చెప్పి కేటీఆర్ ప్రోగ్రాం కవరేజీ చేయాలని చెబుతున్న వినిపించుకోకుండా పోలీసులు నెట్టివేసే ప్రయత్నం చేశారు. అక్కడికి చేరుకున్న వెంకటాపూర్ తహసీల్దార్ మంజుల పోలీసులకు నచ్చజెప్పడంతో డీపీఆర్ఓను అనుమతించినట్లు తెలిసింది.

బర్త్‌డే సంబరాలు

నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుమార్తె ధర్మిష్ఠ పుట్టినరోజు వేడుకలను ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేయగా పురావస్తుశాఖ అధికారులు ఆలయంలో బర్త్‌డే జరుపుకోవద్దని తెలిపారు. దీంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రామప్ప గార్డెన్‌లో ఏర్పాటు చేయగా మంత్రి కేటీఆర్ ధర్మిష్ఠతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.



రామప్ప ఆలయ చరిత్రను కేటీఆర్‌కు వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్



డీపీఆర్ఓ రఫిక్, పోలీసుల మధ్య వాగ్వాదం



ములుగులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రులు



నూతన పోలీస్ స్టేషన్‌లో ఎస్పైని కూర్చొబెడుతున్న మంత్రులు

సభకు తరలిన నాయకులు



సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెంకటాపురం(కె): జిల్లాలో ఐటి శాఖ మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం రామప్పలో జరిగే సాగునీటి దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు వెంకటాపురం మండలం బీఆర్ఎస్ శ్రేణులు మండల అధ్యక్షుడు గంపారాంబాబు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, మండల కార్యదర్శి పిల్లారి శెట్టి మురళి, అధికార ప్రతినిధి డర్రా దామోదర్, సర్పంచ్‌లు పూజారి ఆదిలక్ష్మి, పూనెం శ్రీదేవి, సోర్లం సమ్మయ్య, మడకం సారమ్మ, అట్టం సత్యవతి, ఎంపీటీసీలు సాంబశివరావు, వేల్పూరి లక్ష్మీనారాయణ, జాగర శివాజీ, మద్దుకూరి ప్రసాద్ ఉన్నారు.

కన్నాయిగూడెంలో..



నినాదాలు చేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పర్యటనకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం జిల్లా కేంద్రంలో ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా తరలివెళ్లారు. మండల యూత్ నాయకుడు సరెడ్ల అశోక్, సీనియర్ నాయకుడు చిన్నికృష్ణ, వెంకటయ్య, రామయ్య, సర్పంచ్‌లు దుర్గం నారాయణ, సూర్యనారాయణ, ప్రభాకర్, సాగర్, ఉమామహేశ్వరిలు వెళ్లినవారిలో ఉన్నారు.

చెరువుల పండుగకు ఏర్పాట్లు



ఏటూరునాగారం: లెవల్ చేయిస్తున్న అధికారులు



వాజేడు: పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్

ఏటూరునాగారం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు(గురువారం) చెరువుల పండుగ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందు కోసం తాళ్లగడ్డలోని గణేష్‌కుంట చెరువులో బతుకమ్మ వేడుకలు, ఇతర కార్యక్రమాన్ని చేపట్టేందుకు స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టితో లెవలింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ రవీందర్, లక్ష్మీనారాయణ, మినాజ్, వెంకన్న, చుక్కయ్య పాల్గొన్నారు.

వాజేడు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించ తలపెట్టిన చెరువుల పండుగ ఏర్పాట్లను తహసీల్దార్ సయ్యద్ సర్వర్ బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని మొరుమూరు, దూలాపురం, చెరుకూరు, టేకులగూడెం కాలనీ, పెద్ద గొళ్ల గూడెం గ్రామ పంచాయతీల్లోని 5 చెరువుల వద్ద చెరువుల పండుగను నిర్వహించాలని అధికారులు నిశ్చయించారు. అందులో భాగంగానే చెరువుల పండుగకు అవసరమైన ఏర్పాట్లను మొదలు పెట్టారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పలిమెల: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యునిటీ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం మండలం కేంద్రంలో సైబర్ జాగృతి దివస్‌ను పురస్కరించుకొని ఎస్సై అరుణ్ సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫేక్ కాల్స్‌కి ఓటీపీలు, పాస్‌వర్డులు కానీ ఇతరులతో పంచుకోవడం చేయవద్దన్నారు. ఓఎల్ఎక్స్ మోసాల బారినపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హనీట్రాప్‌లపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్స్ మిస్సింగ్ కేసులు పెరగడంతో సీఈఐఆర్ పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అరుణ్

నాయకుల అరెస్టు అన్యాయం



పోలీస్ స్టేషన్‌లో అఖిలపక్ష నాయకులు

వెంకటాపురం(కె): జిల్లా పర్యటనకు వస్తున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అఖిల పక్ష నాయకులను పోలీసులు అరెస్టు చేయటం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. ఐటీ శాఖ మంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా అఖిల పక్ష నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయటం బాధాకరమన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అఖిల పక్ష నాయకులు పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, సొసైటీ డైరెక్టర్ పల్నాటి ప్రకాశ్, సీపీఎం నాయకులు గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, బీజేపీ నాయకులు రఘురామ్, తదితరులు ఉన్నారు.

పుస్తె, మట్టెల అందజేత



పుస్తె మట్టెలు, నగదు అందిస్తున్న నాయకులు

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన నిరుపేద యువతి వివాహానికి జీకేఆర్(జి.కోన రాజశేఖర్) ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన మొలంగిరి మల్లక్క– కిష్టయ్య దంపతులు నిరుపేదలు కావడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండగా కుమార్తె వనిత వివాహం జరిపించడం ఇబ్బందిగా మారింది. దీంతో మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్ ద్వారా సమాచారం తెలుసుకున్న జీకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు, మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, డాక్టర్ ప్రతాపగిరి ప్రసాద్, నాగరాజులు బుధవారం సదురు యువతి వివాహానికి హాజరయ్యారు. ఫౌండేషన్ ద్వారా పుస్తె మట్టెలు, పూలుపండ్లు, నూతన వస్త్రాలు, నగదును సహాయంగా అందించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి ఫౌండేషన్, మేదరి సంఘం ద్వారా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మేదరి సంఘం మండల అధ్యక్షుడు పాడి రాజయ్య, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాల వేణుగోపాల్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీధర్, పాడి సరోజన, రేపాల వెంకటమ్మ ఉన్నారు.

రైతులంతా సంఘటితం కావాలి

ఏటూరునాగారం: హక్కులను సాధించుకునేందుకు రైతులంతా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ క్షేత్రస్థాయి సంఘటన మంత్రి దోనురు రాము పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రామాలయంలో బుధవారం రైతులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టె రైతు ప్రస్తుతం చెప్పుకోవడానికి కూడా ఇష్టపడటం లేదన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియాలు కిసాన్ సంఘ్ కృషి, పోటారంతో అమలయ్యాయని అన్నారు. రైతులకు దేశంలోని అన్ని వనరులను దక్కించుకునే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తోట రామారావు, పోలబోయిన మురళీధర్, ఇప్పలపల్లి రమేష్, బాస పుల్లయ్య, ఐనాల రాములు, మల్లయ్య, అశోక్, సాంబశివరావు, నూతి కృష్ణ, వైకుంఠం, గణపతి, సతీష్, అశోక్, కృష్ణ, రఘు, వెంకటనర్సయ్య, అర్జున్ సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాము

గుడుంబా విక్రయదారుల అరెస్టు



అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ములుగు రూరల్: గుడుంబా విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత తెలిపారు. మండలంలోని మల్లంపల్లి, రాంనగర్ గ్రామాలలో బుధవారం దాడులు నిర్వహించగా ఏడుగురు పట్టుబడినట్లు పేర్కొన్నారు. కొంగరి లక్ష్మి, నాగుల స్రవంతి, రమ, రాజయ్య, అజ్మీర రాజమ్మ, తిరుమల, రంగమ్మలను అదుపులోకి తీసుకొని 23 లీటర్ల గుండుంబాను స్వాధీనం చేసుకొని, కేసులు నమోదు చేసి ములుగు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ సోదరుడు లక్ష్మయ్య మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సీతక్క బుధవారం పరామర్శించారు. లక్ష్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రాస మల్లయ్య కుటుంబాన్ని సీతక్క పరామర్శించారు. ఆమె వెంట జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, చంద్రమౌళి, సర్పంచ్ కల్పన, జయపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కార్మికులకు యూనిఫాం పంపిణీ

పలిమెల: గ్రామపంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికులకు పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత బుధవారం ఏకరూప దుస్తులు (యూనిఫామ్) అందించారు. మండల కేంద్రంలోని పలిమెల గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన దుస్తులను పారిశుద్ధ్య కార్మికులకు అందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, వార్డు సభ్యులు సూరిబాబు ఉన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న సర్పంచ్ పుష్పలత

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చిట్యాల: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సాయిసుధ, ఉపాధ్యాయులు



కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రమేష్ నాయక్



మహాముత్తారంలో..

మల్హర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కొయ్యూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావుడియా రమేష్ నాయక్ అన్నారు. కొయ్యూరు గ్రామంలో బుధవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొయ్యూరు పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ ఎడ్ల రవి, ఉపాధ్యాయులు శారద, విద్యార్థుల తల్లిదండ్రులు మధుసూదన్, మహేందర్, మల్లయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని నవాబుపేట ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు కలిగి ఉన్నాయని విద్యార్థులు చక్కగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలని సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుసునపు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి పాఠశాలను ఉన్నతంగా తీర్చిద్దినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే సకల సౌకర్యాలు కలిగి ఉన్నాయని, అలాగే ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు ఎక్కడో చదువుకోవాల్సిన అవసరం లేదని, ఉన్న ఊరులో చక్కటి పాఠశాల ఉందని అందులో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దొడ్డ ఆదర్శ్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించాలని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లకర్తి, కాసులపహడ్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వాడవాడలు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు గురించి గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, రవీందర్, కే.శ్రీధర్ స్వామి, మధుసూదన్, రాజయ్య, రవి ప్రసాద్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండల కేంద్రంలోని 1, 4వ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు యత్నారంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బాడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన లభిస్తుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, రాజేశ్వరి, స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి చెరువు పరిసరాల్లో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పక్కనే ఉన్న ఇండ్ల పరిసరాలకు మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే ఫైర్‌ఇంజన్‌కు సమాచారం అందించారు. మంటలు వ్యాపించకుండా నీళ్లు చల్లారు. సంఘటన స్థలానికి ఫైరింజన్ చేసుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274